క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన పల్లా, పోచంపల్లి, పొన్నాల





జనగామ: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫాం హౌజ్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జాతీయ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన యశస్వినిరెడ్డి



పాలకుర్తి: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇంద్రభవనంలో జరిగిన రాష్ట్ర ఓబీసీ సమావేశంలో రాష్ట్ర నాయకుడు పులి గణేష్‌తో కలిసి సన్మానించారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు.

కిట్ల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని శివునిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో 10 మంది బోధకాలు వ్యాధిగ్రస్తులకు ఎంఎండీపీ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌కుమార్ ఎంఎండీపీ కిట్లను వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జనార్దన్, సీహెచ్ఓ వెంకటస్వామి పాల్గొన్నారు.

హెల్మెట్ల అందజేత



హెల్మెట్లతో ర్యాలీ తీస్తున్న కార్యకర్తలతో ఎర్రబెల్లి

దేవరుప్పుల: కార్యకర్తలను కాపాడుకునే దిశలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భవిష్యత్ ఆలోచనతో కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలకు హెల్మెట్లను పంపిణీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో అధికార పార్టీ రాజకీయ గాలాలకు చిక్కకుండా నిత్యం పార్టీ స్మరణం చేసుకునేలా నెత్తిన గులాబీ రంగులతో కూడిన హెల్మెట్లను తయారు చేయించినట్టు తెలుస్తోంది. దీంతో పార్టీ రంగు ప్రచారంతోపాటు మోటారు సైకిల్ వినియోగించే వారి ప్రాణరక్షణకు దోహదపడేలా అందించిన హెల్మెట్లతో ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం జనగామ-సూర్యాపేట రహదారిలో ర్యాలీలో పాల్గొనడం గమనార్హం.

స్పోర్ట్స్ కిట్ల బహూకరణ



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆబాద్ సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను బహూకరించారు. క్యారమ్ బోర్డు, చెస్, టెన్నికాయిట్, స్కిప్పింగ్ తాడు తదితర క్రీడా సామగ్రిని జిల్లా జి.ఎస్.టీ కోఆర్డినేటర్ లయన్ రమణారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, పూర్వ జిల్లా గవర్నర్లు లవకుమార్‌రెడ్డి, కన్నా పరశురాములు, హెచ్ఎం సమ్మక్క పాల్గొన్నారు.

'కోళ్ల ఫాం నిర్మాణాన్ని నిలిపివేయాలి'

జనగామ రూరల్: స్టేషన్‌ఘనపూర్ మండలంలోని రంగరాయగూడెం గ్రామంలో ఎస్సీ కాలనీ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న లేయర్ కోళ్లఫాం నిర్మాణాన్ని నిలిపివేయాలని జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ ఠాకూర్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు.

నిరుపయోగంగా రైతు వేదిక

● నిర్వహణ లేమితో మద్యం ప్రియులకు అడ్డాగా మారిన పరిస్థితి



రాజవరం రైతు వేదిక



పగుల గొట్టి తీసిన తలుపు

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని రైతు వేదిక నిధుల లేమితో నిరుపయోగంగా మారింది. దీంతో తలుపులు, కిటికీలు పగుల గొట్టి మద్యం ప్రియులు అడ్డాగా మార్చుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో కేంద్ర, రాష్ట్ర నిధులతో క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించి వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించింది. వేదికలో సంబంధిత అధికారుల కోసం రెండు గదులు, రైతులు సమావేశాలు నిర్వహించుకునేందుకు హాలుతో పాటు సౌకర్యాలు కల్పించారు. అధికారులు ప్రతీ రోజు రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇచ్చేవారు. కాగా, ఇవి గ్రామానికి దూరంగా ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు, కిటికీలు పగులగొట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. విషయం తెలుసుకున్న క్లస్టర్ ఏఈఓ వినయ్‌కుమార్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి అందులో ఉన్న ఫ్యాన్లు, కుర్చీలు మరోచోటికి మార్పించారు. తిరిగి సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఖర్చు చాలా అవుతుందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు అందడం లేదు కావున రైతులే ముందుకు రావాలని కోరుతున్నారు.

22లోపు జాతర పనులు పూర్తి చేయాలి



జాతర పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న, అధికారులు

● ఆర్డీఓ వెంకన్న

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పనులు ఈనెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలయంలో పార్కింగ్, క్యూలైన్, కల్యాణ మండపంలో చలవ పందిళ్లు, గుట్టపై మహామండపం, మెట్లు, ఘాట్ రోడ్డులో జాతర పనులను ఆయన పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈఓ మోహన్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, ఆర్‌ఐ ఉన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దయాకర్, పక్కన నాయకులు

జనగామ: రక్తదానం మరొకరికి ప్రాణదానం చేయడం లాంటిదని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ లవకుమార్ రెడ్డి, కన్న పర్శరాములు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు పోకల జమున, గాడిపల్లి ప్రేమలతారెడ్డిలు అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకోగా, 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు ముస్త్యాల దయాకర్, మసిఉర్ రెహమాన్, ఉల్లెంగుల సందీప్, కదిరె రాజశేఖర్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, మారబోయిన పాండు, డాక్టర్ కరుణాకర్ రాజు, డాక్టర్ మార్తాల దివ్య, అల్లాడి ప్రభాకర్‌రావు, మహేశ్వర్ రావు, శ్యాంసుందర్, పగిడిపాటి సుధ, అనిత, రాజ్ కుమార్, మాజీద్, సలీం పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

● మండల పశువైద్యాధికారి అనిత



కోళ్ల ఫాంను పరిశీలిస్తున్న అనిత

లింగాలఘణపురం: బర్డ్‌ఫ్లూపై కోళ్ల ఫాంల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి అనిత సూచించారు. ఏపీలో బర్డ్‌ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా మండలంలోని కోళ్ల ఫాంలను పరిశీలించాలనే ఆదేశాల మేరకు సోమవారం కళ్లెంలో దండు శ్రీనివాసు ఫాంను పరిశీలించామన్నారు. మండలంలో 17 కోళ్ల ఫాంలు ఉండగా అందులో అన్నీ బాయిలర్ కోళ్ల ఫాంలని, లేయర్స్ (గుడ్లుపెట్టే కోళ్ల ఫాం) ఎక్కడా లేవని తెలిపారు. బాయిలర్ కోళ్లు 45 రోజుల్లో విక్రయించడం జరుగుతుందని, మండలంలో ఏ ఒక్క ఫాంలో ప్రస్తుతం కోళ్లు లేవన్నారు. కొత్తగా కోడి పిల్లలను తెచ్చే రైతులు ఫాంలను బ్లీచింగ్ చేసుకోవాలని, ఎక్కడైన ఎక్కువ మొత్తంలో కోళ్లు చనిపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

పెండింగ్ నిధులు విడుదల చేయండి



జనగామ రూరల్: గ్రామపంచాయతీల నిర్వహణ కోసం పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని గ్రామ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గం కాలపరిమితి ముగిసినప్పటి నుంచి జీపీల్లో రోజువారీ నిర్వహణ అయిన పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్‌లో డీజిల్ పోయించడం, మరమ్మతులు, బ్లీచింగ్, ఫాగింగ్, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణల కోసం అప్పులు తెచ్చి చెల్లిస్తున్నామని తెలిపారు. చెక్కులు గత సంవత్సరం ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిధులు విడుదల చేయకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యదర్శులు రాజు, మధు, ప్రఫుల్, ఇస్తాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కుర్చపల్లి, గోవర్ధనగిరి, కోమల్ల, కంచనపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రామ పార్టీల విస్తృతస్థాయి సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు చెబితే ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్, రుణమాఫీ, రైతు భరోసాలాంటి పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు నిస్తామని వారు పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, కావటి భాస్కర్‌యాదవ్, తోటకూర రమేష్, నామాల బుచ్చయ్య, మంద రమేష్, లోనె శ్రవణ్, రంగోజు ఈశ్వరయ్య, ఎండీ షబ్బీర్, వట్టిపల్లి రవీందర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, వల్లాల పురుషోత్తం, లోనె రవి, బాలపురి రాజేందర్, నారగోని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళాలు అందజేస్తున్న దాతలు

నర్మెట: మండలకేంద్రంలోని అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ భక్తుల సహకారంతో పునర్నిర్మాణ పనులు చేపట్టి విగ్రహప్రతిష్ఠలు చేశారు. కాగా, కొన్నె ప్రసాద్ రూ.21,116, మహేశ్వరం రాధాకృష్ణ శ్రవంతి రూ.20,116, పులి అరవింద్ రూ.10,116, మహేశ్వరం విజయ శ్రీనివాస్ రూ.10, 016, దేవసాని శ్రీకాంత్ రూ.5,116 సోమవారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో జంగిటి అంజయ్య, గంగం రాకేష్ రెడ్డి, పాతూరి శేఖర్, కల్లూరి గణేష్, పజ్జూరి మనోహర్, చల్ల కిష్టయ్య, కొండ బాలయ్య, గూడ సేనారెడ్డి, గంగం రఘుపతి రెడ్డి, దేవుల పల్లి జనార్ధన్, పినింటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన బడేకోలు రమేశ్‌రెడ్డి మృతి చెందాడు. కాగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

'సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి'

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



జనగామ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ కోరారు. సోమవారం పట్టణ అధ్యక్షుడు బొమ్మ కంటి అనిల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే సరోత్తంరెడ్డిని గెలిపించాలన్నారు. నాగపురి రాజమౌళి, ఆరుట్ల దశమంతరెడ్డి, సరికొండ విద్యాసాగర్ రెడ్డి, బుడుగుల రమేశ్, లక్ష్మీనర్సయ్య, గుజ్జుల నారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జనవరి 5న నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టులో డివిజన్ కేంద్రంలోని ఒయాసిస్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులను సాధించి అవార్డులను అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. గణిత టాలెంట్ టెస్టులో కె.చరణ్(8వ తరగతి), పి.సాద్విన్‌రెడ్డి(3వ), ఎం.నోమాన్(3వ తరగతి) అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. అదేవిధంగా జి.హాసిని(10వ తరగతి), కె.శివ(8వ), పి.ఐశ్వర్య(7వ), పి.శ్వేదన్‌రెడ్డి (6వ), సీహెచ్.మహన్య(6వ తరగతి) జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈనెల 16న హనుమకొండలో కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, హనుమకొండ రిజిస్ట్రార్ రాంచందర్, ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. కాగా, గణిత టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు కమలాకర్, రవీందర్, కీర్తిప్రసాద్, శ్రీలత, స్రవంతి ,షకీరా, అర్చన అభినందించారు.

చెస్‌పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో యాజమాన్యం

దేవరుప్పుల: యునైటెడ్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఓపెన్ టు ఆల్ చెస్ చాంపియన్ షిప్-2025లో మండల కేంద్రంలోని శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థులు 26 మంది పోటీల్లో పాల్గొని ఆరు విభాగాల్లో ప్రతిభ కనబర్చినట్టు కరస్పాండెంటు తోటకూరి పాండుకృష్ణ తెలిపారు. అండర్-7 విభాగంలో యశ్వసిన్ ప్రథమ బహుమతి, అండర్-9 కేటగిరిలో ఆరుష్‌నాథ్ (ప్రథమ), అర్జున్ సిద్దార్థ (ద్వితీయ), అండర్-11లో ఉదీప్ (ప్రథమ), అఖిలేష్ (ద్వితీయ), అండర్-13 విభాగంలో సాత్విక, త్రివేణి(ప్రథమ), కళ్యాణ్, చరణ్ (ద్వితీయ), సిరిచందన తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగ చెస్ చాంపియన్ షిప్ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందలు తెలిపింది. పాఠశాల ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస మార్గం అనుసరించాలి



బచ్చన్నపేట: రామకృష్ణ పరమహంస మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని అప్పుడే సన్మార్గంలో పయనిస్తారని మండల కేంద్రంలోని రామకృష్ణ విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ కరికె ఊర్మిల ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి పాఠశాలలో రామకృష్ణ పరమహంస జయంతి, పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని అన్నారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిమ్మ రాంరెడ్డి, ఉపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి, భాస్కర్, నర్సింహులు, శివ, మోనాలి, మయూరి, మంజుల, గీత, జ్యోతి, శారద, సుధారాణి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు



గుంతలు తీయిస్తున్న పోలీసులు

దేవరుప్పుల: శాంతిభద్రతల పరిరక్షణకు పరిమితమైన పోలీసు శాఖ వ్యవసాయ రంగ పరిరక్షణలో భాగంగా ఇసుక అక్రమ రవాణాను నిలువరించేందుకు కఠిన చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ఇటీవల వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని గొల్లపల్లి, ముస్‌పహాడ్, దాదాసాహెబ్‌కాలనీ, కోలుకొండ గ్రామాల పరిధి వాగు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలించే అడ్డదారులను గుర్తించారు. కాగా, సోమవారం స్థానిక పోలీసులు ట్రాక్టర్లు వెళ్ల కుండా ఆయా గ్రామాల్లో వాగుకు వెళ్లే అడ్డదారుల్లో పొక్లెయినర్లతో గుంతలు తీశారు.

ఆలయానికి బస్సు సర్వీసు ప్రారంభం

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయానికి బస్సు సర్వీసును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సిద్ధేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా హైదరాబాద్ నుంచి బస్సు సర్వీసులను వేయించామన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి అందించామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈఓ చిందం వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓంనమశివాయ, డైరెక్టర్లు సూత్రమే రామకృష్ణ, తిరుపతిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

'కుల గణన సర్వేలో అన్యాయం'

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో మున్నూరు కాపు కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే సరిగా నిర్వహించక 1.05 లక్షలు ఉన్న మున్నూరు కాపు కులస్తులను తగ్గించి చూపడం దారుణమన్నారు. కార్యక్రమంలో పోగుల సారంగపాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి రమేశ్ బాబు, చిగురు విజయ్ కుమార్, చింతల రాజు, గుజ్జుల నారాయణ, తోట సత్యనారాయణ, సుంకరనేని కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా రవీందర్‌ను గెలిపించాలి'



మాట్లాడుతున్న సదానందం

చిల్పూరు: ఉపాధ్యా, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని ఎస్‌యూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి సదానందం కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందిన రవీందర్ రెడ్డి ఆరేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తూనే ఉన్నాడన్నారు. రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఈడ్ అర్హత కలిగిన ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 19న ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8179985886 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



దేవరుప్పల: కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



జనగామ: మొక్క నాటి నీరు పోస్తున్న నాయకులు



జనగామ: పండ్లు పంపిణీ చేస్తున్న మహిళా ప్రతినిధులు

సాక్షి నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు. కాగా, చిల్పూరులో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో అభిమానులు మోకాళ్లపై గుడి మెట్లు ఎక్కి పూజలు చేశారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి



వర్షిత్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కోమటిగూడెం గ్రామానికి చెందిన గూడెల్లి వర్షిత్(13) అనే బాలుడు ఈనెల 4వ తేదీన క్రిమిసంహారక మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి గూడెల్లి రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోమటిగూడెం గ్రామానికి చెందిన రాజు, రాధిక దంపతులు వ్యవసాయకూలీలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కాగా, చిన్న కుమారుడు వర్షిత్ స్టేషన్‌ఘన్‌పూర్ సేయింట్‌థామస్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. బుద్ధిగా ఉండాలని, చెడు తిరుగుళ్లు తిరగవద్దని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన వర్షిత్ ఈనెల 4వ తేదీన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. అయితే తల్లిదండ్రులకు విషయం చెప్పకుండా కడుపు నొప్పి వస్తుందని చెప్పగా 4న హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో 14న హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.